క్లుప్తంగా

లక్ష్యాన్ని చేరుకోవాలి



తెలకపల్లి: విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలని నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు అన్నారు. సోమవారం మండలంలోని లక్నారంలో ద మిషన్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ప్రేరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాగరాజు, ప్రభాకర్, లక్నారం యువకులు విద్యార్థులు పాల్గొన్నారు.

197 కొత్త ఓటర్ల నమోదు

తాడూరు: మండలంలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ఓటరు నమోదు ప్రత్యేక శిబిరంలో 197 మంది కొత్త ఓటర్లు నమోదైనట్లు తహసీల్దార్ శివశ్రీనివాస్ తెలిపారు. ఊట్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 151 పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌ఓలతో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. మృతిచెందిన 204 మంది ఓటర్ల పేర్లను తొలగించామన్నారు. సమావేశంలో ఆర్‌ఐ వెంకటేష్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లేశ్వరంలో గ్రామసభ



పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరంలో సర్పంచ్ తిరుపాటి నాగరాజు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన పలు అభివృద్ధి పనులు, ప్రస్తుతం చేయాల్సిన పనులపై చర్చించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి, ఉపసర్పంచ్ నర్సింహ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు భేష్

కల్వకుర్తిరూరల్: సామాజిక సేవలో లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ జూలూరు రమేష్ బాబు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణలు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కల్మిచర్ల రమేష్ ప్రవంతి, శ్రీధర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



అమ్రాబాద్: మండల కేంద్రం పదర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ సీసీ కెమెరాలను ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికోసం రూ.10 వేలు వితరణ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామలింగయ్యయాదవ్, రేణుక, సతీష్ యాదవ్, తదితరులు ఉన్నారు.

'ఆధ్యాత్మ' రామాయణం గ్రంథావిష్కరణ

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని కోదండ రామస్వామి దేవాలయంలో తెలుగు భారతి సంస్థ ప్రధాన కార్యదర్శి సాహితీ వేత్త వేదార్థం మధుసూదన శర్మ సోమవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆధ్యాత్మ రామాయణం గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముని జీవితం ఆదర్శమన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ అర్థ శాస్త్రవేత్త, కవి, డాక్టర్ కర్నాటి లింగయ్య ఆధ్యాత్మ రామాయణం గ్రంథాన్ని రచించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు రాఘవాచార్యులు, కమిటి సభ్యులు గోవిందు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



బల్మూర్: మండల కేంద్రంలో లేబర్ కార్డు కలిగిన కార్మికులకు తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ సంస్థ వారు సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. షుగర్, బీపీ పరీక్షలతో పాటు అవసరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. ఆ సంస్థ కోఆర్డినేటర్ భాస్కర్ మాట్లాడుతూ 54 రకాల రోగాలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. సిబ్బంది మధు, సురేష్, బీమేష్ పాల్గొన్నారు.



చారకొండలో



అమ్రాబాద్‌లో



తాడూరు మండలం చెన్నకేశవాలయంలో



తెలకపల్లిలో



కల్వకుర్తి మండలం తాండ్రలో

మార్మోగిన శ్రీరామ నామస్మరణ

- భక్తులతో ఆలయాలు కిటకిట
- కనులపండువగా శోభాయాత్ర

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా అయోధ్యలో సోమవారం బాలరాముడి ప్రాణప్రతిష్ఠ ఉత్సవం సందర్భంగా ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటికి కాషాయ జెండాలను పంపిణీ చేశారు. సాయంత్రం శ్రీరాముడి చిత్రపటాలతో కనులపండువగా శోభాయాత్ర చేపట్టారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

■ కల్వకుర్తి డివిజన్ పరిధిలో హనుమాన్ దేవాలయాలు, శివాలయాలలో భక్తులు రామనామ జపాన్ని పఠించారు. మండలంలోని తర్నికల్, తోటపల్లి, బెక్కెర గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాండ్రలో గ్రామవాసి గోలి సుదర్శన్ రెడ్డి అంజనేయస్వామికి వెండి కిరిటాన్ని బహూకరించారు. సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డి పల్లిలో హనుమాన్ దేవాలయంలో అన్నదానం చేశారు.

■ కల్వకుర్తి పట్టణంలోని 18వ వార్డులో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ కాషాయ ధ్వజాన్ని ఆవిష్కరించారు. కాషాయ జెండాలతో యువకులు ర్యాలీలు చేపట్టారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు కోలాటాలతో ఆకట్టుకున్నారు.

■ కల్వకుర్తిరూరల్ పరిధిలో పంజుగుల, రఘుపతిపేట, తోటపల్లి, తాండ్ర, గుండూరు, మార్చాల, కురుమిద్ద గ్రామాల్లో కాషాయ ధ్వజాలను ఎగురవేశారు. మండలంలోని తాండ్ర హనుమాన్ దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డి, అభిష్ట రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రఘుపతి పేటలో జేఏసీ చైర్మన్ రవి కుమార్ ఆధ్వర్యంలో శోభాయాత్ర చేపట్టారు.

■ ఉప్పునుంతల మండల కేంద్రంతో పాటు వెల్టూరు, పెనిమిళ్ల, మామిళ్లపల్లి తదితర గ్రామాల్లో శ్రీరాముడి శోభయాత్ర నిర్వహించారు. రాముడు, లక్ష్మణుడు, సీతాదేవి, హనుమంతుడి వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు. కేదార్వేశరాయంలో ఎల్‌ఈడీ ఏర్పాటు చేసి బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాన్ని తిలకించారు. మండలంలోని కొరటికల్‌లో శ్రీరాముడి శోభాయాత్రలో గ్రామానికి చెందిన ముస్లింలు పాల్గొని మతసామరస్యాన్ని చాటుకున్నారు. బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలను వీక్షించారు.

■ కొల్లాపూర్ పట్టణంలో భజరంగదళ్ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

■ పెద్దకొత్తపల్లి మండల కేంద్రంతో పాటు పెద్దకార్పాముల, దేవల్‌తిరుమలాపూర్, సాతాపూర్, కల్వకోలు, గంట్రావుపల్లి గ్రామాల్లో అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని దేవాలయాల వద్ద ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై భక్తులు వీక్షించారు. ఆయా గ్రామాలలో సీతారాముల విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ రేణుకా నాగరాజు పాల్గొన్నారు.

■ కొల్లాపూర్ రూరల్ మండల పరిధిలోని కుడికిల్ల, సింగోటం, తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేసి శ్రీరామచంద్రుని చిత్రపటాలు, జెండాలతో శోభాయాత్రలు నిర్వహించారు.

■ బల్మూర్ మండల కేంద్రంలో సీతారాముల విగ్రహాలకు జలభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో భక్తి గీతాలను ఆలపించారు. నృత్యప్రదర్శలతో కళాకారులు ఆకట్టుకున్నారు.

■ తాడూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది.

■ తెలకపల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో టీవీలు, ఫోన్లలో అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను చూసి తరించారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కరసేవకులను సన్మానించారు.

■ పెంట్లవెల్లి మండల కేంద్రంలో మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోలు గ్రామాల్లో మహిళలు బొడ్డెమ్మలు ఆడారు. శ్రీరాముడి విగ్రహాలతో పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

■ చారకొండ మండలంలోని సిర్సనగండ్ల అయోధ్య గుట్టపై సీతారామచంద్రాస్వామి దేవాలయంలో రామనామస్మరణతో మార్మోగింది. స్వామివారి కల్యాణ వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతం ,అభిషేకం, సహస్రనామార్చన, అనంతరం సిర్సనగండ్ల పుర విధుల్లో ఊరేగింపు, పల్లకీసేవలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెండు ఎల్ఈడీ టెలివిజన్ల ద్వారా బాలరాముడి ప్రాణప్రతిష్ఠను మహోఘట్టాన్ని తిలకించారు. అనంతరం శ్రీరాముని శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ చైర్మన్ రామ శర్మ, ఈఓ రఘు, అర్చకులు లక్ష్మణ్ శర్మ, మురళీధర్ శర్మ ఉన్నారు.

■ అమ్రాబాద్ మండల కేంద్రంలో ఆధ్యాత్మికత వాతావరణం ఉట్టిపడింది. స్థానిక అమరేశ్వారాలయం నుంచి పురవీధులగుండా శ్రీరాముని శోభాయాత్రలో జై శ్రీరాం నామస్మరణ మార్మోగింది. యువకులు నృత్యాలు చేశారు.

■ బిజినేపల్లి, తిమ్మాజీపేట మండలాల్లోని పలు ఆలయాల్లో ఏర్పాటు చేసిన భారీగా స్క్రీన్‌ల ద్వారా బాలరాముడి ప్రతిష్ఠ మహోత్సవాన్ని వీక్షించారు. పాలెం, వట్టెం వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో రాముల వారి పట్టాభిషేకం, పాదుకల పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయాలను శుద్ధి చేశారు.

■ వంగూరు మండలంలోని రంగాపూర్, వంగూరు, పోల్కంపల్లి తదితర గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి శ్రీరామ నామజపాన్ని వినిపించారు.

■ వెల్దండ మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్, రాచూర్, చెదురుపల్లి, కుప్పగండ్ల, కొట్ర తదితర గ్రామాల్లో భక్తుల తాకిడి అధికంగా కనిపించింది. పెద్దాపూర్‌లో హోమాలు నిర్వహించారు. సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు చిందం కృష్ణయ్య, మట్ట వెంకటయ్యగౌడు, బచ్చు రామకృష్ణ ఉన్నారు.

■ చారకొండ మండలంలోని జూపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి చారకొండ తదితర గ్రామాల్లో దేవాలయాలయాలను మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. యువకులు కోలాటాల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. జూపల్లిలో శోభాయాత్రలో భాగంగా భక్తి గీతాలను ఆలపించారు.

■ మన్ననూర్‌లోని వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాముని చిత్రపటాన్ని పురవీధుల గుండ ఊరేగించారు. యువకులు డీజే నృత్యాలు, మహిళలు కోలాటం, బొడ్డెమ్మలతో అలరించారు.

■ లింగాల మండల కేంద్రంలోని కోదండరామాలయంలో రామనామ తారక మంత్రహోమం నిర్వహించారు. అనంతరం భక్తులు బాలరాముడి చిత్రపటాన్ని ఊరేగించారు. మహిళలు మంగళహారతులు ఇచ్చారు.

■ అచ్చంపేట రూరల్ పరిధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పలు సంఘాల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ, శోభాయాత్ర నిర్వహించారు.



అచ్చంపేటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



బిజినేపల్లి మండలం పాలెంలో



వెల్దండ మండలం పెద్దాపూర్‌లో



లింగాలలో



ఉప్పునుంతల మండలం కొరటికల్‌లో



పెద్దకొత్తపల్లిలో



బల్మూర్‌లో



పెంట్లవెల్లిలో..

ఆడపిల్లలపై వివక్ష చూపొద్దు

కల్వకుర్తి టౌన్: ఆడపిల్లలపై వివక్ష చూపొద్దని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. సోమవారం పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి క్రీడా పోటీలను అధికారులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. అదే విధంగా బాలల హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను అయన ఆవిష్కరించారు. విజేతలకు ఐసీడీఎస్ అధికారులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇబ్రహీం, ఎంఈఓ బాసునాయక్, సీడీపీఓ వెంకటమ్మ, పోషణ్ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ విజ్ఞాన్, జీఈసీఓ సూర్యచైతన్య, కల్వకుర్తి కేజీబీవీ ఎస్‌ఓ రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, లక్ష్మీ, అరుణ, జ్యోతి, అశ్విని, రసీదా, రేణుక, మల్లీశ్వరి పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేజీబీవీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాలికలకు కేజీబీవీలో డివిజన స్థాయి కబడ్డీ, ఖోఖో టెన్నికాయిట్ పోటీలు ఏర్పాటు చేశారు. కబడ్డీలో పెద్దకొత్తపల్లి, ఖోఖోలో కోడేరు, టెన్నికాయిట్ పెంట్లవెల్లి మండలాల జట్లు విజేతలుగా నిలిచారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ సత్యం

ఆర్డీఓ నాగరాజు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ యూసూఫ్ అలీ, కేజీబీవీ ఏఎస్‌ఓ లత, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, సీఆర్‌పీలు రమేష్‌రెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ఆవరణలో సోమవారం జాతీయ బాలిక వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు జెడ్పీటీసీ రోహిణి బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రేణుక, సర్పంచ్ యాదమ్మ, ఎంపీడీఓ గంగమోహన్, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, షీటీం ఇన్‌చార్జ్ వెంకటయ్య, కేజీబీవీ ఎస్‌ఓ విజయ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల ప్రత్యేక పూజలు



కందనూలు: తిమ్మాజిపేట బావాజిపల్లిలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి దేవాలయంలో సోమవారం ధ్వజస్తంభం ప్రారంభోత్సవంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనతో పాటు ఆలయంలో సీతారాములు, ఆంజనేయస్వామి, గణపతి, సుబ్రమణ్యస్వామి, నవగ్రహాలను, నాగదేవతలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా లెనిన్ వర్ధంతి

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కామ్రెడ్ లెనిన్ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శివవర్మ, తారాసింగ్, సలీం, కార్తీక్, బత్తిని రాజు, భాష, జాల్లాపురం సురేందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



కల్వకుర్తి: పట్టణంలోని బ్రిలియంట్ పాఠశాల విద్యార్థిని రుత్విక రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా పోటీలకు ఎంపికైనట్లుగా పాఠశాల ప్రిన్సిపాల్ రేణుధర్ తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థినితో పాటుగా వారి తల్లిదండ్రులను ఆయన అభినందించారు. ఖేలో ఇండియాలో భాగంగా ఫుట్‌బాల్ పోటీలలో ఈ నెల 24వ తేదీ నుంచి నిజామాబాద్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు.

విద్యార్థినులకు గోల్డ్ మెడల్

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు గోల్డ్ మెడల్ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో ఈ నెల 17 నుంచి 20 జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ సొసైటీ కబడ్డీ లీగ్ పోటీల్లో కళాశాలకు చెందిన సింధు, నందిని బంగారు పతకాలు సాధించారన్నారు.

మల్లురవికి ఘన సన్మానం



ఊర్కొండ: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధిగా నియమితులైన మల్లురవిని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమీ, ఊర్కొండ ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపినాయక్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌నాయక్, తిరుపతినాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా



ఊర్కొండ: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని భ్రమరాంబ ఆలయంలో సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అలాగే భ్రమరాంబదేవి, ఆంజనేయస్వామిలకు అభిషేకాలు చేశారు. హనుమాన్ చాలీసా పఠించారు.

జాతీయ స్థాయికి ఎంపిక



పెంట్లవెల్లి: మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన నల్లపోతుల కుర్మయ్య శశికళల కుమార్తె రుషిత ఆదివారం కాచిగూడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రింగ్ బాల్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. బాలిక బోరబండ గురుకుల పాఠశాలలో చదువుతోంది. సర్పంచ్ నల్లపోతుల గోపాల్ బాలికను అభినందించారు.

పార్టీలకు అతీతంగా సహకరిస్తా

లింగాల: గ్రామాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా సహకారం అందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం ఎంపీపీ లింగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజెండాలో పొందుపర్చిన అంశాల వారిగా అధికారులు నివేదికలను చదివి వినిపించారు. జీల్గుపల్లిలో విద్యుత్ సరఫరా సక్రమంగా కావడంలేదని సర్పంచ్ కొత్త ప్రసన్న సభ దృష్టికి తీసుకెళ్లారు. కొత్తచెర్వుతండా, కోమటికుంటలో అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ పనులను పూర్తి చేయించాలని సర్పంచులు మల్లేష్, గుడి బచ్చన్నలు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పాయపల్లిలో మురుగు కాల్వల నిర్మాణంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని ఎంపీడీఓ గీతాంజలిని ఆదేశించారు. మండలంలో దశల వారిగా బెల్టు షాపులను తొలగించాలని, నల్లబెల్లం విక్రయాలను అరికట్టాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. మరో వారం రోజుల్లో పదవీ కాలాన్ని పూర్తి చేసుకోనున్న మండల సర్పంచులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, తహసీల్దార్ ఉమ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమలత, మండల విద్యాధికారి చంద్రుడు, ట్రాన్స్‌కో ఏఈ అప్పలనాయుడు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ విడుదల

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ మొదటి వార్షికోత్సవ సభ వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకులు విష్ణు, కుమార్ తదితరులు మాట్లాడుతూ 26న విగ్రహావిష్కరణ మొదటి వార్షికోత్సవం నిర్వహిస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చత్రునాయక్, ఎంపీపీ లింగమ్మ, డాక్టర్ శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

తాడూరు: మండల కేంద్రంలో ఎలాంటి నాలా అనుమతులు లేని భూమిలో వెంచర్ ఏర్పాటు చేశారని గ్రామస్తుడు సంద మల్లయ్య సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి సంబంధించిన 421 సర్వే నంబర్‌లో ఏర్పాటు చేసిన వెంచర్‌ను పరిశీలించాలని కోరారు.

నోటిఫికేషన్ విడుదల

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మీనరసింహ్మాస్వామి ఆలయం నూతన పాలకవర్గం కమిటీ ఎన్నికకు దేవాదాయ శాఖ నుంచి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు జతచేసి దరఖాస్తును అడ్వకేట్‌తో నోటరీ చేయించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయంలో గడువులోపు సమర్పించాలని ఈఓ తెలిపారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



తెలకపల్లి: మండలంలోని కార్వంగలో ఛత్రపతి శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు సోమవారం గ్రామస్తులు భూమి పూజ చేశారు. స్థలదాతలు రాంచంద్రారెడ్డి, సతీష్‌రెడ్డితో పాటు గ్రామస్తులు రమణారెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు

వెల్దండ: మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన దొబ్బల వెంకటమ్మ, సాయిలుపై అదే గ్రామానికి చెందిన మల్లయ్య, భార్య పద్మలు పాతకక్షలతో దాడి చేశారు. సోమవారం వెంకటమ్మ ఫిర్యాదు మేరకు భార్యభర్తలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై..

వెల్దండ: మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన డేరంగుల బాలస్వామి పెద్దాపూర్ గేట్ వద్ద రోడ్డు దాటే క్రమంలో ఆటో ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి సోదరుడు డేరంగుల నర్సింహ్మ ఫిర్యాదు మేరకు సోమవారం ఆటో డ్రైవర్ అనంతరాములుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉప్పునుంతల: మండలంలోని పెద్దాపూర్ సమీపంలో ఆదివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. బల్మూరు మండలం కొండనాగులకు చెందిన భాషమోని అంజనేయులు దుందుబీ వాగు నుంచి ట్రాక్టర్‌తో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేశారు.